క్లుప్తంగా

రాజబాబుకు మాజీ ఎమ్మెల్యే వాసుబాబు నివాళి



రాజబాబు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుబాబు, తదితరులు

ద్వారకాతిరుమల: ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబుకు ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు గురువారం నివాళులర్పించారు. ముందుగా ఆయన సీహెచ్ పోతేపల్లిలోని రాజబాబు ఇంటికి వెళ్లి, ఆయన కుమారుడు సంజయ్‌ను, కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం రాజబాబు చిత్రపటానికి పూల మాలలు వేసి, ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ప్రతాపనేని వాసు, సీహెచ్ పోతేపల్లి, మద్దులగూడెం గ్రామ సర్పంచ్‌లు పోల్కంపల్లి అనీల్, చెలికాని ప్రవీణ్, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు దాకారపు బంగారమ్మ, పసుపులేటి సత్యనారాయణ, వెజ్జు వెంకటేశ్వరరావు, నీలాద్రి, దాకారపు అగ్గియ్య, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



అగ్ని ప్రమాద బాధితులకు నిత్యావసర వస్తువులను అందజేస్తున్న స్థానిక నేతలు

కుక్కునూరు: మండలంలోని దాచారం పంచాయతీ ఉప్పర మద్దికట్ల గ్రామంలో మడకం ముత్యాలు ఇల్లు ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదానికి గురైంది. ఈ విషయం తెలిసిన వెంటనే తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి స్పందించారు. తపన ఫౌండేషన్ తరఫున రూ.10 వేల విలువైన నిత్యావసర వస్తువులను పంపి బాధిత కుటుంబానికి స్థానిక నాయకులతో అందజేశారు. కార్యక్రమంలో చెరువుకట్ల సతీష్ కుమార్, వాడపల్లి లక్ష్మాచార్యులు, కోమల నాగబాబు, వెల్‌కమ్ బాలకృష్ణ, గంగాధర్, రామకృష్ణుడు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివ పార్వతుల కల్యాణం



స్వామి వారికి అర్చన నిర్వహిస్తున్న పురోహితులు

కుక్కునూరు: మహా శివరాత్రి పురస్కరించుకొని మండలంలోని శివాలయాల్లో బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం శివ పార్వతుల శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. గురువారం మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం, సాయంత్రం ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పోసాని అరెస్ట్ దారుణం

దెందులూరు: ఏపీ ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్, సీనియర్ వైఎస్సార్‌సీపీ నేత పోసాని కృష్ణమురళి అరెస్ట్ దారుణమని ఆ పార్టీ ఏలూరు జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. గురువారం శ్రీరామవరంలో ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా అరెస్టు చేసిన రోజు తేదీతో కాపీ ఇస్తారని, కూటమి ప్రభుత్వం ఎంత కక్ష ధోరణి వేధింపులేకపోతే ఒకరోజు తర్వాత తేదీ వేసి ముందు రోజు, అదీ రాత్రి అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. కూటమి పెద్దలను రాజకీయంగా విమర్శిస్తే అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల హామీలు అమలు చేయలేదని అన్నారు. రాజకీయాల నుంచి తప్పుకుంటున్నానని పోసాని కృష్ణ మురళి బహిరంగంగా ప్రకటించినప్పటికీ ఆయన్ని అరెస్ట్ చేయడం హేయమైన చర్యని తెలిపారు.

సేలం బయలుదేరిన వాలీబాల్ జట్టు



వాలీబాల్ పోటీలకు సేలం వెళుతున్న క్రీడాకారులు

దెందులూరు: సౌత్ జోన్ బాలుర వాలీబాల్ జేఎన్‌టీయూ కాకినాడ జట్టు గురువారం తమిళనాడు రాష్ట్రం సేలం బయలుదేరి వెళ్లింది. వేగవరం హేలాపురి సైన్స్ టెక్నాలజీ కళాశాలలో ప్రిన్సిపాల్ లావణ్య, ఏడీ కరుణ నిధి మాట్లాడుతూ సౌత్ జోన్ వాలీబాల్ పోటీలకు ఎంపికైన జేఎన్‌టీయూ కాకినాడ బాలుర జట్టుకు వేగవరం కళాశాల ఆతిథ్యం, శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు. శిక్షణ ముగియడంతో తమిళనాడుకు జట్టు బయలుదేరి వెళ్లిందని వివరించారు.

రైతు కంట.. మిర్చి మంట

- తెగుళ్లతో పడిపోయిన దిగుబడులు
- గిట్టుబాటు ధర లేక రైతుల ఆందోళన
- ప్రభుత్వ ప్రోత్సాహం కరువు



లింగపాలెం మండలంలోని పొలాల్లో ఆరబెట్టిన ఎండిమిర్చి



ధర్మాజీగూడెంలో ఆరబెట్టిన ఎండిమిర్చిని బస్తాల్లోకి నింపుతున్న దృశ్యం

లింగపాలెం: తెగుళ్లు ఆశించి సరైన దిగుబడులు రాకపోవడం, పెట్టుబడి ఖర్చులు పెరిగిపోవడం, దీనికితోటు గిట్టుబాటు ధర రాక మిర్చి రైతులు కుదేలవుతున్నారు. మెట్టప్రాంతమైన లింగపాలెం మండలం జిల్లాలోనే మిర్చిపంటకు ప్రసిద్ధి చెందెంది. మండలంలో సుమారు 400 ఎకరాల్లో రైతులు మిర్చిపంటను సాగుచేశారు. గతంలో ఈ ప్రాంతంలో సుమారు 1,300 ఎకరాల్లో మిర్చి పంటను సాగుచేసేవారు. అయితే నేడు ఈసాగు సగానికి పైగా తగ్గిపోయింది. దీంట్లో ఒక్క ధర్మాజీగూడెంలోనే అధికంగా ఈపంటను సాగుచేస్తుంటారు. ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడం కూడా కారణమని రైతులు ఆవేదన చెందుతున్నారు.

పడిన దిగుబడులు

సాధారణంగా ఎకరాకు 25 నుంచి 28 క్వింటాళ్ల వరకు ఎండిమిర్చి దిగుబడులు రావాల్సి ఉండగా ప్రస్తుతం 14 నుంచి 18 క్వింటాళ్ల దిగుబడులు మాత్రమే వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. వీటిలో ఒక క్వింటాకు పైగా తాలుకాయ వస్తుందంటున్నారు. మిర్చి తోటలకు నల్లితెగులు, వైరస్ తెగుళ్లు వ్యాపించటంతో దిగుబడులు దెబ్బతింటున్నాయి. మరోవైపు గట్టుబాటు ధరలేక పోవటంతో రైతులు కలవరం చెందుతున్నారు. పెట్టుబడులు చూస్తే అధికం అయ్యిపోతున్నాయని, ధరచూస్తే కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎకరాకు రూ.2.50 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు పెట్టుబడి అవుతుందంటున్నారు. ఎకరం రూ.30వేలు చొప్పున కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నట్లు కౌలు రైతులు తెలిపారు.

గతేడాది క్వింటాకు ధర రూ.23 వేలు

గతేడాది క్వింటా ఒక్కింటికి రూ.21 వేల నుంచి రూ.23 వేల వరకు ఉండగా ప్రస్తుతం మిర్చినాణ్యతను బట్టి రూ.12 వేలు నుంచి రూ.13 వేలు వరకు వ్యాపారస్తులు కొనుగోలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. దీంతో చేసేదిలేక అధిక ఖర్చులు వెచ్చించి విజయవాడ, గుంటూరు మిర్చి యార్డులకు తరలిస్తున్నారు. కొందరు దళారులు ధరను భయట పెట్టకుండా రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసేందుకు చూస్తున్నారని రైతులు అంటున్నారు. కనీసం క్వింటాకు రూ.22 వేలు ధర పలికితేగాని తమకు గిట్టుబాటుకాదని రైతులు చెబుతున్నారు. ఈమేరకు పంటలకు గిట్టుబడి ధర వచ్చేంతవరకు నిల్వ ఉంచేందుకు ఈప్రాంతంలో శీతల గిడ్డంగిని నిర్మించేందుకు ప్రజాప్రతినిధులు కృషిచేయాలని రైతులు కోరుతున్నారు.

తెగుళ్లతో తీవ్ర నష్టం



మిర్చి పైరుకు తెగుళ్ల సోకడంతో దిగుబడులు తగ్గిపోయాయి. దీనికి తోడు గిట్టుబాటు ధర రాకపోవడంతో మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆరుకాలం కష్టపడి పడించినా కనీసం పెట్టుబడులైనా వస్తాయో లేదో తెలియని పరిస్థితి.

– జోగి వెంకటేశ్వరరావు, కౌలురైతు, ధర్మాజీగూడెం

ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి



కూలీలు, మందుల ఖర్చులు పెరిగిపోవడంతో పెట్టుబడులు ఎక్కువైపోయాయి. ఎకరాకు సుమారు రూ.3 లక్షల వరకు పెట్టుబడులు పెట్టాల్సి ఉంది. ప్రభుత్వం ఎండిమిర్చికి మద్దతు ధరను కల్పించి దళారుల నుంచి రైతులను కాపాడాలి.

– చలమాల మారేశ్వరరావు, రైతు, కొణిజర్ల

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పోలవరం రూరల్: సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం నిమిత్తం ఈ నెల 28వ తేదీ శుక్రవారం పోలవరం ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. పోలవరం, రామయ్యపేట, కృష్ణారావుపేట విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు ఆటంకం

టి.నరసాపురం: మండలంలోని రాజుపోతేపల్లి, బండివారిగూడెం సబ్‌స్టేషన్ల వార్షిక మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు విద్యుత్ ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నెల 28వ తేదీ శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు.

వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలే బలం

కామవరపుకోట: వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలే బలమని చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు అన్నారు. గురువారం కామవరపుకోటకు వచ్చిన ఆయన స్థానిక నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. పార్టీ పటిష్టతకు, బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికుల వలె పని చేయాలని, వారికి అన్ని విధాల అండగా ఉంటామని, పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నానాది సాగర్, చింతలపూడి నియోజకవర్గ మేధావుల విభాగం అధ్యక్షుడు రుద్రపాక నాగమల్లేష్, ప్రచార కమిటీ అధ్యక్షుడు మేరుగు బాబురావు, సోషల్ మీడియా అధ్యక్షుడు బందేల ప్రభాకర్ పాల్గొన్నారు.

వైభవోపేతంగా రథోత్సవం



అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి రథోత్సవం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

టి.నరసాపురం: టి.నరసాపురంలో అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి రథోత్సవాన్ని ఆలయ కమిటీ చైర్మన్ కమ్మిల రమేష్‌రాజు ఆధ్వర్యంలో గురువారం వైభవంగా నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా బుధవారం రాత్రి అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని పినాకపాణి దంపతులు వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. కాశీవిశ్వేశ్వరునికి 100 కిలోల లడ్డూను ప్రసాదంగా వనదుర్గ పీఠం శివదుర్గానంద గురూజీ ఆశ్రమ భక్తులు సమర్పించారు. గ్రామోత్సవం మేళతాళాలతో, విచిత్ర వేషధారణలతో ఘనంగా సాగింది. శుక్రవారం ఆలయం వద్ద అఖండ అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

కృష్ణ ప్రసాద్ శాస్త్రి సేవలు మరువలేనివి



కృష్ణ ప్రసాద్ శాస్త్రి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వాసుబాబు

భీమడోలు: జ్యోతిష్య కేసరి, హంపీ పీఠం సిద్ధాంతి, పంచాంగకర్త కాశీబొట్ల వీరవెంకట నాగేశ్వర కృష్ణ ప్రసాద్ శాస్త్రి సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. పోలసానిపల్లికి చెందిన కృష్ణ ప్రసాద్ శాస్త్రి (66) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. గురువారం పోలసానిపల్లిలోని ఆయన స్వగృహంలో ఆయన కుమారుడు పార్వతీశ్వర శర్మ, కుటుంబ సభ్యులను వాసుబాబు పరామర్శించారు. శాస్త్రి చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు. శాస్త్రి చేసిన సేవల వల్లే ఈ ప్రాంతానికి తగిన గుర్తింపు లభించిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, జిల్లా కార్యనిర్వాహకవర్గ సభ్యుడు తుమ్మగుంట రంగ, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, ఎంపీటీసీ గంటా శ్రీనువాసరావు, నాయకులు పసుపులేటి సత్యనారాయణ, చిలపర్తి రామారాయుడు, అంబటి నాగేంద్ర ప్రసాద్, చెరుకూరి మధు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన బుర్రకథ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని పేరయ్య కోనేరు ప్రాంగణంలో వార్షిక రామకోటి మహోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి రామచంద్రపురానికి చెందిన గొర్రెల కృష్ణమూర్తి ప్రధాన కథకునిగా, గొర్రెల రాము రాజకీయం, గొర్రెల శ్రీనివాస రావు హాస్యంతో గానం చేసిన బుర్రకథ ఆద్యంతం అలరించింది. ఉదయం విశ్వశాంతి సమాజం సభ్యుల ఆధ్వర్యంలో మౌన ధ్యానం, భక్తి గీతాలు, హరేరామ సంకీర్తనలు నిర్వహించారు. స్వామి వారికి సహస్రనామ పూజలు, నిత్య హోమం, నిత కల్యాణం చేశారు. మాఘ బహుళ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉదయం పురం సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో తులసీదళ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం నగరానికి చెందిన మైలవరపు లక్ష్మీ నరసింహం ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు.

వేద పండితులకు సత్కారం

పోలవరం రూరల్: పట్టిసం నిధి మహా శివరాత్రి వేద పారాయణ నిర్వాహక సమితి ఆధ్వర్యంలో మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా వేదపండితులు వేద పారాయణ నిర్వహించారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు శివక్షేత్రం ఆలయ ప్రాకారంలో వేద పండితులు శివ నామ స్మరణ నిర్వహించినట్లు కార్యదర్శి నూరి సర్వేశ్వర సోమయాజులు తెలిపారు. 72 మంది వేద పండితులను రూ.3,27,000 నిధులతో సత్కరించినట్లు కార్యదర్శి తెలిపారు.

కాలువలో తూడు తొలగింపు



జేసీబీతో కాలువను శుభ్రం చేయిస్తున్న దృశ్యం

దెందులూరు: గోదావరి కాలువలో పేరుకుపోయిన తూడును ఇరిగేషన్ అధికారులు జేసీబీలతో తొలగిస్తున్నారు. కొవ్వలి ప్రాంతంలో రెండు రోజులుగా కాలువలో తొలగింపు పనులు కొనసాగుతున్నాయి. కర్రనాచు, తూడు తొలగిస్తే కాల్వ శివారు ఆయకట్టు భూములకు సాగునీరు సరఫరాలో ఇబ్బందులు ఉండవని అధికారులు తెలిపారు. నీటి వినియోగదారుల సంఘం చైర్మన్ వెలమాటి రాంబాబు కమిటీ సభ్యులు ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో తొలగింపు పనులు చేయిస్తున్నారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు



కుక్కునూరు: ప్రశాంతంగా జరుగుతున్న పోలింగ్

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ యు.రవిచంద్ర ఆధ్వర్యంలో సీఐ వి.కృష్ణబాబు పర్యవేక్షణలో ఎస్సై షేక్ జబీర్, సిబ్బంది పటిష్ట పోలీసు బందోబస్తు నిర్వహించారు. జంగారెడ్డిగూడెంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఎన్నికల పరిశీలకులు సీహెచ్ శ్రీధర్, ఆర్డీవో ఎంవీ రమణ పరిశీలించారు. పోలింగ్ సరళి వివరాలు అడిగి తెలుసుకున్నారు. డివిజన్ పరిధిలో 23 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమైన పోలింగ్ 10 గంటల వరకు మందకొడిగా సాగింది. 10 గంటల వరకు కేవలం 6.13 శాతం మాత్రమే నమోదైంది. పోలింగ్ ముగిసే సమయానికి 69.98 శాతం నమోదైంది. డివిజన్ మొత్తం మీద 13,594 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 9513 మంది ఓటును వినియోగించుకున్నారు.

మన్యంలో పోలింగ్ ప్రశాంతం

బుట్టాయగూడెం: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు గురువారం గిరిజన ప్రాంతంలో పోలింగ్ ప్రశాతంగా జరిగింది. మండలంలో మొత్తం 1036 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో మొత్తం 746 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తహసీల్దార్ పీవీ చలపతిరావు తెలిపారు. కాగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై దుర్గా మహేశ్వరరావు పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. జీలుగుమిల్లి మండలంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ మండలంలో 473 ఓట్లు ఉండగా 329 ఓట్లు నమోదైనట్లు తహసీల్దార్ ఉదయ్ భాస్కర్ తెలిపారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్

పోలవరం రూరల్: ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రశాంతంగా జరిగాయి. మండలంలో 1016 మంది ఎమ్మెల్సీ ఓటర్లు నమోదు కాగా, 652 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తహసిల్దార్ బీఎస్ఆర్ఎల్‌రాజు తెలిపారు.

ప్రశాంతంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక

కామవరపుకోట: ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మొత్తం 1257 ఓట్లకు గాను 940 ఓట్లు పోలైనట్లు, 74.7 శాతం పోలింగ్ నమోదైందని తహసీల్దార్ గడ్డం ఎలీషా తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతం

కొయ్యలగూడెం: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా గురువారం కొయ్యలగూడెంలో నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని ఎంపీడీవో కె.కిరణ్ కుమార్ పేర్కొన్నారు.

ప్రశాంతంగా పోలింగ్

కుక్కునూరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మండల వ్యాప్తంగా 75 శాతం ఓట్లు పోలయ్యాయి. గురువారం పట్టభద్దల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముందస్తు జాగ్రత్తగా పోలీస్ సిబ్బంది పటిష్ట ఏర్పాట్లు చేశారు.

ప్రశాతంగా పోలింగ్

వేలేరుపాడు: ఉమ్మడి ఉభయగోదావరి జిల్లా పట్టభద్రుల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో 198 మందికి గాను 161 మంది ఓటును వినియోగించుకున్నారు.

ప్రశాంతంగా పోలింగ్

చింతలపూడి: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు చింతలపూడి నియోజకవర్గంలో గురువారం ప్రశాంతంగా ముగిశాయి. పోలింగ్ ముగిసే సరికి 70.70% ఓటింగ్ శాతం నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. చింతలపూడి నియోజకవర్గంలో మొత్తం గ్రాడ్యుయేట్ ఓటర్లు 10,598 గాను 7,493 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. సీఐ రవీంద్ర నాయక్ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

68.84 శాతం నమోదు

టి.నరసాపురం: ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 632 మంది పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకున్నట్లు అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిబాబ తెలిపారు. 68.84 శాతం పోలింగ్ నమోదైంది.

77.69 శాతం పోలింగ్

ద్వారకాతిరుమల: మండలంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ద్వారకాతిరుమలలో 77.69 శాతం పోలింగ్ నమోదైంది. మండలంలో 2,160 ఓట్లుకు గాను 1,678 ఓట్లు పోలయ్యాయి.



జంగారెడ్డిగూడెం: పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎన్నికల అబ్జర్వర్ సీహెచ్ శ్రీధర్, ఆర్డీవో



చింతలపూడి: పోలింగ్ కేంద్రం వద్ద క్యూలైన్‌లో నిలుచున్న ఓటర్లు



కొయ్యలగూడెం: పోవైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

కరుణించమ్మా.. కనకదుర్గమ్మ !



రెడ్డి రాజుల కాలంలో నిర్మించిన కల్యాణ మండపం



రెడ్డిగణపవరంలో నూతనంగా నిర్మించిన కనకదుర్గమ్మ గుడి



కనకదుర్గమ్మ

- 14 నుంచి 18 వరకూ ఉత్సవాలు
- గిరిజన పూజారుల ప్రత్యేక పూజలు
- లక్షలాదిగా తరలిరానున్న భక్తులు

బుట్టాయగూడెం: మండలంలోని రెడ్డి గణపవరం గ్రామంలో కొలువైన శ్రీఅన్నపూర్ణ విశ్వేశ్వర కనకదుర్గమ్మ ఉత్సవాలు మార్చి 14 నుంచి 18 వరకు నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త భౌమరాజు సత్యనారాయణరాజు తెలిపారు. ఈ ఏడాది ఉత్సవాలకు ఒక ప్రత్యేకత ఉందని అదే శతాబ్ది ఉత్సవాలన్నారు. దుర్గమ్మ భక్తుల కోర్కెలు తీర్చే తల్లిగా, వరాలిచ్చే అమ్మగా రెడ్డి రాజుల కాలం నుంచి 900 ఏళ్ల నుంచి నేటి వరకు భక్తుల పూజలు అందుకుంటుంది. ఈ ఆలయంలో ప్రతి సంవత్సరం హోలీ పూర్ణిమ నుంచి ఐదు రోజుల పాటు ఇక్కడ ఘనంగా ఉత్సవాలు నిర్వహిస్తారు.

రెడ్డిగణపవరంలో ఆధ్యాత్మిక శోభ

బుట్టాయగూడెం మండలం రెడ్డి గణపవరంలో ఆధ్యాత్మిక శోభ విరాజిల్లుతుంది. దాతలు, గ్రామ పెద్దలు, గ్రామస్తుల సహకారంతో అన్నపూర్ణ విశ్వేశ్వర కనకదుర్గమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో విఘ్నేశ్వరుడు, కాలభైరవుడు, అభయాంజనేయ స్వామి, నవగ్రహాల విగ్రహాలతో పాటు భక్తుల సౌకర్యార్థం మండపాలను కూడా నిర్మించారు. అలాగే సుమారు 80 లక్షల వ్యయంతో కనదుర్గమ్మ తల్లి దేవాలయాన్ని నిర్మించారు. అందమైన రంగులతో రూపుదిద్దుకున్న ఆలయంతో కనకదుర్గమ్మతల్లి భక్తులకు దర్శనం ఇస్తూ పూజలందుకుంటుంది.

ఐదు రోజులు నిర్వహిస్తాం



మార్చి 14వ తేదీ నుండి 18వ తేదీ వరకూ ఐదు రోజులు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నాము. భక్తుల కోర్కెలు తీర్చే తల్లిగా కనకదుర్గమ్మ తల్లి పేరు ఉండడంతో లక్షల్లో భక్తులు ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుంటారు. ఉత్సవాల్లో ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా పూర్తి ఏర్పాట్లు చేస్తున్నాము.

–భౌమరాజు సత్యనారాయణరాజు, ఆలయ ధర్మకర్త, రెడ్డిగణపవరం

ఈ ఏడాది ఉత్సవాలు ఎంతో ప్రాముఖ్యం



ఈ ఏడాది 100వ సంవత్సరం కనకదుర్గమ్మ ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం మంచినీరు కొరత లేకుండా ఏర్పాటు చేస్తున్నాం. అలాగే వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నాం. ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలి.

–అల్లూరి రత్నాజీరావు, ఉత్సవ కమిటీ చైర్మెన్, రెడ్డిగణపవరం